ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
MHR TV
మెదక్ | శుక్రవారం 11, సెప్టెంబర్ 2026 | పేజీలు: 4 | వెల: రూ.1

## ఆదిలాబాద్ విమానాశ్రయం
# వేగవంతం

- ఆదిలాబాద్ విమానాశ్రయానికి అడుగులు వేగం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అమలుకు కీలక ముందడుగు
- రాజ్‌నాథ్, రామ్మోహన్ నాయుడుతో కిషన్‌రెడ్డి భేటీ
- జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్
- ఏర్పాటుకు రక్షణ శాఖ సుముఖత
- ప్రాజెక్టు పురోగతిపై కేంద్ర మంత్రులతో సమీక్ష
- వచ్చే వారంలో ముగ్గురు నోడల్ అధికారుల నియామకం
- డీపీఆర్, మాస్టర్‌ప్లాన్ రూపకల్పన వేగవంతం

**ప్రజాస్వరం, హైదరాబాద్**

ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో శనివారం సమావేశమైనట్లు వెల్లడించారు. సమావేశంలో ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించినట్లు తెలిపారు.

**వచ్చే వారంలో నోడల్ అధికారుల నియామకం**

జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అమలును మరింత వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం తరపున ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని

మిగతా 2లో..



## హైదరాబాద్‌ను బ్లూ, గ్రీన్ సిటీగా
# తీర్చిదిద్దుతాం

### 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని క్యూర్ చట్టం

- నగర రవాణాకు కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్
- మూసీ తొలిదశకు
- రూ.7,345.12 కోట్లతో అనుమతులు
- 20 టీఎంసీల గోదావరి జలాల తరలింపునకు చర్యలు
- జీహెచ్ఎంసీని
- మూడు కార్పొరేషన్లుగా విభజించాం
- అన్ని సంస్థల సమన్వయానికి
- చట్టబద్ధ వ్యవస్థ
- సీఎం అధ్యక్షతన క్యూర్
- అత్యున్నత పాలకమండలి
- మురుగునీటిని శుద్ధి చేసి
- పచ్చదనానికి వినియోగం
- 2034 నాటికి ట్రిలియన్
- డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ప్రపంచ నగరాలతో పోటీపడేలా
- హైదరాబాద్ అభివృద్ధి



**ప్రజాస్వరం, హైదరాబాద్**

హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. నగర విస్తరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో రాబోయే 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమర్థమైన పాలన అందించేందుకు కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ (క్యూర్) చట్టాన్ని రూపొందించామని చెప్పారు. తెలంగాణ శాసనసభలో క్యూర్ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడారు.

**సమగ్ర రవాణా ప్రణాళిక**

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ రూపొందించామని శ్రీధర్‌బాబు తెలిపారు. నగరం పెద్దఎత్తున విస్తరిస్తున్నందున భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాలనా వ్యవస్థను కూడా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా

మిగతా 2లో..



బీఎస్పీ వారసత్వంలో మాయావతి
## ఊహించని ట్విస్ట్..

- కుటుంబ పాలనకు నో..
- వారసత్వ రాజకీయాలకు చెక్
- సోదరుడి కుమారులకు
- రాజకీయ బాధ్యతలు లేవంటూ
- మాయావతి స్పష్టత
- దీపికా ఆనంద్‌కు కీలక
- బాధ్యతలపై సంకేతాలు
- న్యాయవిద్య చదువుతున్న
- దీపికాపై మాయావతి ఫోకస్
- BSPలో కొత్త రాజకీయ
- వారసత్వంపై ఆసక్తికర చర్చ
- కుటుంబానికి ఒక న్యాయం..
- పార్టీలో మరో వ్యూహమా?

**ప్రజాస్వరం, నేషనల్‌బ్యూరో**

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో బహుజన్ సమాజ్ పార్టీ (BSP) అధినేత్రి మాయావతి మరోసారి సంచలన నిర్ణయంతో రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేశారు. పార్టీలో కుటుంబ పాలనకు తావులేదని నినదిస్తూనే.. తన సోదరుడు ఆనంద్ కుమార్ కుమారులను రాజకీయ బాధ్యతలకు శాశ్వతంగా దూరం పెడుతున్నట్లు కుండబద్దలు కొట్టారు. అదే సమయంలో ఆయన కుమార్తె, న్యాయవిద్య అభ్యసిస్తున్న కుమారి దీపికా ఆనంద్‌కు కీలక బాధ్యతలు

మిగతా 2లో..

# భారత్, చైనా కలిసి సాగాలి

- మోదీతో జిన్‌పింగ్ భేటీ..
- ఢిల్లీలో మోదీ, జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు
- ఇరు దేశాల సంబంధాలపై
- కీలక అంశాల ప్రస్తావన
- భారత్, చైనా కలిసి నడవాలని
- జిన్‌పింగ్ పిలుపు
- ఆధునిక సాంకేతికతతో వేగంగా
- పురోగతి సాధిద్దామని వ్యాఖ్య
- పరస్పర సామర్థ్యాల
- నుంచి నేర్చుకోవాలని సూచన
- దీర్ఘకాలిక, వ్యూహాత్మక
- ఒప్పందాలకు చైనా సిద్ధం
- మోదీని ఇప్పటివరకు
- 21 సార్లు కలిశానన్న జిన్‌పింగ్
- భారత్‌చైనా సంబంధాలు స్థిరమైన
- అభివృద్ధి దిశలో ఉన్నాయని వ్యాఖ్య
- బ్రిక్స్ సదస్సుకు చైనా
- సహకారంపై మోదీ కృతజ్ఞతలు
- ద్వైపాక్షిక సహకారంపై
- విస్తృతంగా చర్చించిన ఇరువురు



**ప్రజాస్వరం, నేషనల్‌బ్యూరో**

ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఇరువురు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. అనంతరం ఇరు దేశాల తరపున ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

**కలిసి ముందుకు సాగాలి**

ప్రపంచంలోని అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి ముందుకు సాగాలని జిన్‌పింగ్ ఆకాంక్షించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని ఇరు దేశాలు వేగంగా పురోగతి

మిగతా 2లో..

# ప్రజల ఆస్తులను పరిరక్షిస్తాం

- రెవెన్యూ సంస్కరణల లక్ష్యం
- ప్రజల ఆస్తుల పరిరక్షణే
- ధరణితో గత పాలకులు
- భూముల అక్రమాలు
- స్వప్రయోజనాలకు
- లక్షలాది ఎకరాలు
- అర్ధరాత్రి వేళల్లోనూ
- రిజిస్ట్రేషన్లు జరిగాయి
- ధరణి తప్పిదాలతో రైతులు
- కార్యాలయాల చుట్టూ తిరిగారు
- భూమి లేకుండానే
- పాసుపుస్తకాలు ఇచ్చారు
- నకిలీ పట్టాలతో రైతుబంధు
- నిధులు దుర్వినియోగమయ్యాయి
- 125 ఏళ్ల తర్వాత
- సమగ్ర భూసర్వే చేపట్టాం
- ఇప్పటివరకు 5 లక్షలకు
- పైగా దరఖాస్తుల పరిష్కారం
- భూభారతిలో 80 మాడ్యూల్స్‌కు
- బదులు 5 మాత్రమే
- 47,440 ఎకరాలను
- 22ఏ నిషేధిత జాబితా
- నుంచి తొలగించాం





**ప్రజాస్వరం, హైదరాబాద్**

ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని భూముల వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా గత పాలకుల భూ వ్యవహారాల బండారం బయటపడుతుండటంతోనే వారు సభకు రాకుండా మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్నారని విమర్శించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో

మిగతా 2లో..

## 80ల నాటి
# ఫొటోలతో జాగ్రత్త

- సైబర్ మోసాలు జరిగే అవకాశం
- 1980ల నాటి
- ఫొటోలుగా మార్చే ట్రెండ్ వైరల్
- సోషల్ మీడియా
- ప్రకటనలతో సైబర్ నేరగాళ్ల వల
- ఉచితంగా ఎడిటింగ్
- చేస్తామంటూ ఆకర్షించే అవకాశం
- అనుమానాస్పద
- లింకులపై క్లిక్ చేస్తే ప్రమాదం
- ఎస్ఎంఎస్, ఓటీపీ
- వివరాలు తస్కరించే ముప్పు
- కాంటాక్టులు, వ్యక్తిగత
- సమాచారానికీ భద్రత కరువు
- బ్యాంకింగ్, ఆర్థిక
- సమాచారంపై నేరగాళ్ల కన్ను
- ఆర్థిక మోసాలు, గుర్తింపు
- దుర్వినియోగానికి అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచన




**ప్రజాస్వరం, హైదరాబాద్**

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన 1980ల నాటి రెట్రో ఫొటో ఎడిటింగ్ ట్రెండ్‌ను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ హెచ్చరించారు. సాధారణ ఫొటోలను 1980ల నాటి రెట్రో ఫొటోలుగా మార్చుతామంటూ సోషల్ మీడియా ప్రకటనలు, సందేశాల ద్వారా ప్రజలను ఆకర్షించే అవకాశం

మిగతా 2లో..

# మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్



- తన డ్యాన్స్‌తో ఉన్న ఏఐ వీడియో
- చూసి ఆశ్చర్యపోయానన్న కేరళ సీఎం
- మోహన్‌లాల్, విజయ్ కంటే తానే
- బాగా డ్యాన్స్ చేశానని సరదా వ్యాఖ్య
- కేరళలో విద్యుత్ సంక్షోభంపై విమర్శల
- నడుమ వైరల్ అయిన వీడియో
- వినోదం కోసమేనని, ఎవరినీ
- కించపరచలేదని స్పష్టం చేసిన క్రియేటర్లు
- డిజిటల్ టెక్నాలజీ సవాళ్లపై జరిగిన
- సెమినార్లో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు

**ప్రజాస్వరం, నేషనల్‌బ్యూరో**

కేఎస్ఈబీ ఉద్యోగులతో కలిసి తాను నృత్యం చేస్తున్నట్లుగా ఉన్న ఒక కృత్రిమ మేధ (ఏఐ) వీడియోను చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అన్నారు. అయితే, ఆ టెక్నాలజీ పుణ్యమా అని తాను ప్రముఖ నటులు మోహన్‌లాల్, సీఎం విజయ్ కంటే మెరుగ్గా డ్యాన్స్ చేశానని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు.
శనివారం కేరళ జ్యుడీషియల్ అకాడమీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో సతీశన్

మిగతా 2లో..

# ఢిల్లీ డిక్లరేషన్‌కు బ్రిక్స్ దేశాల ఆమోదం

- ఏకతాటిపైకి వచ్చిన బ్రిక్స్ దేశాలు
- ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా సమ్మతి
- భారత్ దౌత్య నైపుణ్యంతో కీలక ఏకాభిప్రాయం
- ఏకపక్ష సుంకాల విధింపుపై ఆందోళన
- అంతర్జాతీయ చట్టాలకు
- విరుద్ధమైన చర్యలకు వ్యతిరేకత
- చర్చలు, దౌత్యంతో
- వివాదాల పరిష్కారానికి పిలుపు
- అణ్వాయుధాలు, సంఘర్షణల ముప్పుపై చర్చ
- అంతర్జాతీయ శాంతి, స్థిరత్వానికి కట్టుబాటు
- తీవ్రవాదాన్ని అన్ని రూపాల్లో ఖండించిన నేతలు
- పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్ దేశాలు




2

# ప్రజల ఆస్తులను పరిరక్షిస్తాం

మొదటిపేజీ తరువాయి

జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి మాట్లాడారు.

**ధరణితో భూముల అక్రమాలు**

తెలంగాణను పోరాడి సాధించుకున్నప్పటికీ గత పాలకులు రాష్ట్రాన్ని స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూముల వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా భావించారని అన్నారు.

ధరణి పోర్టల్ నిర్వహణను దివాళా తీసిన విదేశీ సంస్థకు అప్పగించారని, పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకుని అర్ధరాత్రి వేళల్లోనూ రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లో చోటుచేసుకున్న తప్పుల కారణంగా లక్షలాది మంది రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందన్నారు. ఈ వ్యవస్థ కారణంగా వందలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

**5 లక్షలకు పైగా దరఖాస్తుల పరిష్కారం**

రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవని మంత్రి తెలిపారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని చెప్పారు. ధరణి అమల్లో ఉన్నప్పుడు 2.49 లక్షల దరఖాస్తులు ఉండగా.. భూభారతి అమల్లోకి వచ్చిన తర్వాత మరో 3 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. మొత్తం 5 లక్షలకు పైగా దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు.

పరిష్కరించలేని దరఖాస్తులను ఏ కారణంతో పరిష్కరించలేదో కూడా స్పష్టంగా తెలియజేశామని అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో భూముల సర్వే పూర్తిచేసి రైతులకు పాసుపుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. మరో ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తామని హామీ ఇచ్చారు.

**భూమి లేకుండానే పాసుపుస్తకాలా?**

గత పాలనలో భూములు లేకపోయినా పాసుపుస్తకాలు ఇచ్చారని పొంగులేటి ఆరోపించారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చి రాజకీయ అనుచరులు, బంధువులకు పాసుపుస్తకాలు ఇచ్చారని విమర్శించారు. భూమి లేని వారికి సైతం రైతుబంధు అందించి వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. నల్గొండ జిల్లాలో 14 వేల ఎకరాల్లో సర్వే నిర్వహిస్తే 4 వేల ఎకరాలకు దొంగపట్టాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ధరణిలో 80 మాడ్యూల్స్ ఏర్పాటు చేసి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని, భూభారతి చట్టంలో వాటి సంఖ్యను కేవలం ఐదుకు తగ్గించామని వివరించారు.

**22ఏపై బీఆర్ఎస్‌ను నిలదీత**

25 వేల ఇళ్లు నిషేధిత జాబితాలో ఉన్న మాట వాస్తవమేనని మంత్రి తెలిపారు. కొన్ని దశాబ్దాల క్రితం అసైన్డ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారు ఉన్నారని చెప్పారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం అసైన్డ్ భూములు ఇచ్చిందన్నారు.

అసైన్డ్ భూములు ఉమ్మడి రాష్ట్రం నుంచే నిషేధిత జాబితాలో ఉన్నాయని, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. అసైన్డ్ భూముల విషయంలో ఏం చేయాలో సలహాలు ఇవ్వాలని కోరారు.

**47,440 ఎకరాలు 22ఏ నుంచి తొలగింపు**

ఆగస్టు 31 నాటికి రాష్ట్రంలో మొత్తం 1,02,05,250 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని పొంగులేటి తెలిపారు. ఇందులో 96,36,777 ఎకరాలు ప్రభుత్వ వ్యవసాయ భూములు, 3,73,930 ఎకరాలు ప్రైవేటు వ్యవసాయ భూములు, 1,94,543 ఎకరాలు వ్యవసాయేతర భూములు, 5,12,792 ఎకరాలు ఎండోమెంట్ భూములు ఉన్నాయని వివరించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటితో పోలిస్తే ప్రస్తుతం నిషేధిత జాబితాలోని భూములు 47,440 ఎకరాలు తగ్గాయని చెప్పారు. ఇందులో 23 వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పాత జీవోల్లోని తప్పులను గుర్తించి మరో 20 వేల ఎకరాలను తొలగించామని వివరించారు. 22ఏ నుంచి తొలగించిన మొత్తం 47,440 ఎకరాలకు సంబంధించిన లెక్కలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు.

అయితే బీఆర్ఎస్ హయాంలో తొలగించిన 23 వేల ఎకరాలకు లెక్కలు లేవని కమిటీ పేర్కొందని మంత్రి అన్నారు. భువనగిరిలో 25 వేల ఇళ్లు 22ఏలో ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పిన విషయం ప్రస్తావిస్తూ.. అవన్నీ అసైన్డ్ భూముల్లో ఉన్న ఇళ్లేనని వివరించారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని రాందాస్‌పల్లిలో 1,300 ఎకరాలపై హరీశ్‌రావు మాట్లాడారని, ఆ భూమి దశాబ్దాలుగా నిషేధిత జాబితాలోనే ఉందని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పట్లో ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదని పొంగులేటి ప్రశ్నించారు.




## మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్

మొదటిపేజీ తరువాయి

ప్రసంగించారు. సినిమా, సంగీత రంగాల్లో కాపీరైట్ హక్కుల పరిరక్షణ, డిజిటల్ టెక్నాలజీ సవాళ్లు అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తన అనుభవాన్నే ఉదాహరణగా చూపుతూ, "ఆ వీడియో చూసి నేను షాక్ అయ్యాను. అందులో నేను మోహన్‌లాల్, విజయ్ కంటే బాగా డ్యాన్స్ చేస్తున్నట్లు అనిపించింది" అని సాంకేతిక పరిజ్ఞాన వేగానికి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం కేరళ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న సమయంలో ఈ ఏఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇటీవల విడుదలైన 'జైలర్ 2' చిత్రంలోని 'అల బొలెలో' పాటకు సతీశన్, కేఎస్ఈబీ ఉద్యోగులు డ్యాన్స్ చేస్తున్నట్లు ఈ వీడియోను రూపొందించారు. కేవలం వినోదం కోసమే దీనిని రూపొందించామని, ఎవరినీ అవమానించే ఉద్దేశం లేదని క్రియేటర్లు స్పష్టం చేశారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియోను కోటి మందికి పైగా వీక్షించడం విశేషం.

ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ విద్యుత్ కోతలపై ప్రభుత్వంపై, కేఎస్ఈబీపై విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి అతీంద్రియ శక్తులేమీ కారణం కాదని, రాత్రిపూట వినియోగం పెరగడమే ప్రధాన కారణమని మంత్రి సన్నీ జోసెఫ్ పేర్కొన్న తరుణంలో సతీశన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



# హైదరాబాద్‌ను బ్లూ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతాం

మొదటిపేజీ తరువాయి

విభజించామని, నగరంలోని అన్ని ప్రభుత్వ సంస్థలు సమన్వయంతో పనిచేసేలా చట్టబద్ధ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలకమండలిని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**మూసీ పునరుజ్జీవానికి భారీ నిధులు**

మూసీ పునరుజ్జీవం తొలిదశ పనులకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. నగర భవిష్యత్ అవసరాలను తీర్చేందుకు 20 టీఎంసీల గోదావరి జలాలను తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.

మురుగునీటిని శుద్ధి చేసి చెట్ల పెంపకం, కాలుష్య నియంత్రణకు వినియోగించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణతో పాటు జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంపై దృష్టి పెట్టామని తెలిపారు.

**ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ**

తెలంగాణ రైజింగ్ 2047 పాలసీతో ప్రభుత్వం ముందుకెళ్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. 2034 నాటికి రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలని ఆకాంక్షించారు. పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించే స్థాయికి హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగర గత వైభవాన్ని కాపాడుకుంటూనే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**400 రకాల నేరాల తొలగింపు**

తెలంగాణ ప్రజా విశ్వాసం నిబంధనల సవరణ చట్టం బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో చిన్నపాటి సాంకేతికపరమైన సుమారు 400 రకాల నేరాలను నేరపూరిత పరిధి నుంచి తొలగించే ఉద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు.

ఈచట్టంఅమలుతోవ్యాపారనిర్వహణమరింతసులభతరం అవుతుందని చెప్పారు. చిన్నపాటి కేసుల కారణంగా అనేక సందర్భాల్లో చిన్న వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టం రాష్ట్రంలో అందరికీ ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్టంలోని నిబంధనలపై కలెక్టర్లు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## భారత్, చైనా కలిసి సాగాలి

మొదటిపేజీ తరువాయి

సాధించగలవని అన్నారు.

ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకునేందుకు చైనా సిద్ధంగా ఉందని జిన్‌పింగ్ తెలిపారు.

**మోదీని 21 సార్లు కలిశా**

బ్రిక్స్ సదస్సుకు సంబంధించి తన పుట్టిన రోజునే భారత్ నుంచి ఆహ్వానం అందిందని జిన్‌పింగ్ గుర్తుచేశారు. ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని తెలిపారు.

ఇరు దేశాల మధ్య సంబంధాలను స్థిరమైన అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేశామని జిన్‌పింగ్ పేర్కొన్నారు. భారత్, చైనా మధ్య పరస్పర సహకారం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని అన్నారు.

**చైనా సహకారానికి మోదీ కృతజ్ఞతలు**

భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు చైనా అందిస్తున్న మద్దతు, సహకారానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ద్వైపాక్షిక సహకారంపై చర్చించేందుకు జిన్‌పింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందన్నారు.

ఇరు దేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించినట్లు మోదీ తెలిపారు. బ్రిక్స్ వేదికగా భారత్, చైనా సహకారం మరింత విస్తరించే అవకాశాలపైనా ఇరువురు నేతలు దృష్టి సారించారు.

## 80ల నాటి ఫొటోలతో జాగ్రత్త

మొదటిపేజీ తరువాయి




ఉందని తెలిపారు. ఉచితంగా లేదా అపరిమితంగా ఫొటో ఎడిటింగ్ సదుపాయం కల్పిస్తామంటూ నమ్మబలికి అనుమానాస్పద లింకులను పంపే అవకాశం ఉందని శిఖా గోయల్ పేర్కొన్నారు. అలాంటి లింకులపై క్లిక్ చేసి ఫైళ్లను డౌన్‌లోడ్ చేస్తే సైబర్ నేరగాళ్ల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఏపీకే ఫైళ్ల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు.

ఇలాంటి మోసాల ద్వారా మొబైల్‌లో భద్రపరిచిన ఎస్ ఎంఎస్, ఓటీపీలు, కాంటాక్టులు, బ్యాంకింగ్ వివరాలు, ఆర్థిక సమాచారం, వ్యక్తిగత సమాచారంతో పాటు ఇతర సున్నితమైన డేటాను నిందితులు దొంగిలించే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఆర్థిక మోసాలు, అనధికారిక లావాదేవీలు, గుర్తింపు దుర్వినియోగం వంటి సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎంఎస్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని శిఖా గోయల్ సూచించారు. రెట్రో ఫొటో ఎడిటింగ్ పేరుతో వచ్చే ఆఫర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎవరైనా ఇలాంటి సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## ఢిల్లీ డిక్లరేషన్‌కు బ్రిక్స్ దేశాల ఆమోదం

- **ఏకతాటిపైకి వచ్చిన బ్రిక్స్ దేశాలు**
- **ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా సమ్మతి**
- **భారత్ దౌత్య నైపుణ్యంతో కీలక ఏకాభిప్రాయం**
- **ఏకపక్ష సుంకాల విధింపుపై ఆందోళన**
- **అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైన చర్యలకు వ్యతిరేకత**
- **చర్చలు, దౌత్యంతో వివాదాల పరిష్కారానికి పిలుపు**
- **అణ్వాయుధాలు, సంఘర్షణల ముప్పుపై చర్చ**
- **అంతర్జాతీయ శాంతి, స్థిరత్వానికి కట్టుబాటు**
- **తీవ్రవాదాన్ని అన్ని రూపాల్లో ఖండించిన నేతలు**
- **పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్ దేశాలు**

ప్రజాస్వరం, నేషనల్‌బ్యూరో

ఢిల్లీ డిక్లరేషన్‌కు బ్రిక్స్ దేశాలు ఆమోదం తెలిపాయి. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య విభేదాలు ఉన్నప్పటికీ.. ఇరుదేశాలతో పాటు సౌదీ అరేబియా కూడా డిక్లరేషన్‌కు అంగీకారం తెలిపాయి. భారత్ దౌత్య నైపుణ్యంతో సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించినట్లు తెలుస్తోంది.

**ఏకపక్ష సుంకాలపై ఆందోళన**

ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా సుంకాలు విధించడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా చేపట్టే ఏకపక్ష నిర్బంధ చర్యలను ఖండించాయి.

అంతర్జాతీయ వివాదాలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి కట్టుబడి ఉన్నట్లు నేతలు స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాలు, సంఘర్షణల ముప్పును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

**శాంతి, స్థిరత్వానికి కట్టుబాటు**

అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారంలో పరస్పర సహకారం ప్రాముఖ్యతను బ్రిక్స్ దేశాలు పునరుద్ఘాటించాయి. అంతర్జాతీయ శాంతి, స్థిరత్వానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి. తీవ్రవాద కార్యకలాపాలను బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు తీవ్రంగా ఖండించింది. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన అవసరం ఉందని నేతలు స్పష్టం చేశారు.

**పహల్గాం ఉగ్రదాడికి ఖండన**

గతేడాది జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాల నేతలు ఖండించారు. సీమాంతర ఉగ్రవాదం, తీవ్రవాద చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని స్పష్టం చేశారు.

**నేతలకు మోదీ ప్రత్యేక విందు**

బ్రిక్స్ సదస్సుకు హాజరైన దేశాల నేతలు అనంతరం 'భారత్ ఇన్నోవేట్స్' ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అక్కడ ఫొటోలు దిగడంతో పాటు మొక్కలు నాటారు. రాత్రి 7.30 గంటలకు సదస్సుకు హాజరైన నేతలందరికీ ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక విందు ఇవ్వనున్నారు.




## బీఎస్పీ వారసత్వంలో మాయావతి ఊహించని ట్విస్ట్..

మొదటిపేజీ తరువాయి

అప్పగించే సూచనలు ఇవ్వడం ద్వారా సరికొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపారు.

**కొడుకులకు దక్కని పగ్గాలు..**
**తెరపైకి కుమారి దీపిక**

బీఎస్పీని కుటుంబ పాలన జాడ్యం నుంచి కాపాడటమే తన పరమ లక్ష్యమని మాయావతి స్పష్టం చేశారు. అవివాహితురాలినైన తనకు భద్రత అవసరాల రీత్యా తోడుగా ఉన్న సోదరుడు ఆనంద్ కుమార్ కుమారులెవరికీ.. బీఎస్పీలో చిన్న, పెద్ద ఎలాంటి పదవులూ ఇచ్చే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. అంతేకాదు, భవిష్యత్తులో వారి సంతానానికి కూడా పార్టీలో స్థానం ఉండదని కఠిన నిబంధన విధించారు. అయితే ఆనంద్ కుమార్‌కు సాయం చేసే నెపంతో ఆయన కుమార్తె దీపికా ఆనంద్ రాజకీయ అరంగేట్రానికి మాత్రం పరోక్షంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిజాయితీ, విధేయత, పనితీరు ఆధారంగా ఆమెకు బాధ్యతలు కట్టబెట్టవచ్చని, ఒకవేళ దీపిక అందుకు ముందుకు రాకపోతే బహుజన్ సమాజానికి చెందిన నిబద్ధత కలిగిన మిషనరీ కార్యకర్తకే ఆ అవకాశం దక్కుతుందని వెల్లడించారు.

**జెన్-జీ, జెన్-ఆల్ఫాపై దృష్టి..**
**50 శాతం యువతకే పెద్దపీట**

రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త తరం యువ నాయకత్వాన్ని తెరపైకి తీసుకురావడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నట్లు మాయావతి తెలిపారు. జెన్‌జీ, జెన్‌ఆల్ఫా ఆలోచనలకు అనుగుణంగా పార్టీలో 50 శాతం మేర సంస్థాగత బాధ్యతలను యువతకే కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. రాజ్యాంగ విలువలు, అంబేడ్కర్‌వాద సిద్ధాంతాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే కొత్త తరాన్ని నిర్మించడమే తన సంకల్పమని పేర్కొన్నారు. నాలుగు సార్లు బీఎస్పీ సాగించిన సుపరిపాలనలో రోడ్లు, తాగునీరు, విద్య, ఉపాధి, రక్షణ రంగాల్లో మైలురాళ్ళు సాధించామని, పల్లెల నుంచి వలసలను అడ్డుకున్నామని మాయావతి గుర్తుచేశారు. 2012లో విపక్షాలు సాగించిన కులతత్వ రాజకీయాల కారణంగానే బీఎస్పీ ఓటమి చవిచూడాల్సి వచ్చిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చట్టబద్ధ పాలన అటకెక్కిందని, బీఎస్పీ మళ్లీ అధికారంలోకి రాకుండా ఉండేందుకు ప్రత్యర్థులు 'సామ, దాన, భేద, దండోపాయాలు' ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు.

క్రమశిక్షణారాహిత్యం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా బయటకు పంపిన నేతలను తిరిగి పార్టీలోకి చేర్చుకుంటున్నారంటూ సాగుతున్న ప్రచారాన్ని ఆమె పూర్తిగా కొట్టిపారేశారు. అదంతా తప్పుడు ప్రచారమని, క్రమశిక్షణ ఉల్లంఘించిన ఏ ఒక్కరికీ బీఎస్పీ తలుపులు తిరిగి తెరుచుకోవని తేల్చిచెప్పారు. అంబేడ్కర్‌వాద ఆశయ సాధనకు కార్యకర్తలు పూర్తి శక్తితో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయం వేగవంతం

మొదటిపేజీ తరువాయి

నిర్ణయించినట్లు చెప్పారు. జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్టుకు సంబంధించిన డీపీఆర్, మాస్టర్‌ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉత్తర తెలంగాణ కనెక్టివిటీ అవసరాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

**రక్షణ శాఖ సుముఖత**

ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు, వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష సాకారమయ్యే దిశగా కీలక ముందడుగు పడిందని పేర్కొన్నారు.

**2.75 కిలోమీటర్ల రన్‌వే**

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల అధికారులు ఇప్పటికే పలుమార్లు సమావేశమైనట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. 2026 ఏప్రిల్ 17న అధికారులు విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించారని, 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం అవసరమని నిర్ణయించారని చెప్పారు. ప్రస్తుతం ఐఏఎఫ్ వద్ద ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించిందన్నారు. ఈ భూమిలో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు, ఆపరేషనల్ కాంప్లెక్స్, శిక్షణ, నిర్వహణ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

**సివిల్ టెర్మినల్, ఎంఆర్ఓ కేంద్రం**

పౌర విమాన సేవలకు అవసరమైన సివిల్ టెర్మినల్‌ను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేయనుందని కిషన్‌రెడ్డి తెలిపారు. విమానాల నిర్వహణ, మరమ్మతుల కోసం ఎంఆర్ఓ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి అవసరమైన నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు.



## అధికారంలో ఉంటే సెక్రెటేరియట్‌కు రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు

ప్రజాస్వరం

అధికారంలో ఉంటే సెక్రెటేరియట్‌కు రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు

బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. అసెంబ్లీ లాబీలో శనివారం చిట్‌చాట్ సందర్భంగా సీతక్క బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఎర్రవల్లిలో ఎల్పీ మీటింగ్ నిర్వహించి, పార్టీ ఆఫీస్‌లో మాక్ అసెంబ్లీని ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఫాంహౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపితే పసుపు నీళ్లతో శుద్ధి చేశారని, ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతో ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా? అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాని కేసీఆర్, మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమం పట్ల ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫాంహౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ మినహా దేశంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు.



ఫాంహౌస్‌లో ఎల్పీ మీటింగ్, పార్టీ ఆఫీస్‌లో అసెంబ్లీ మీటింగ్ అంటే ఉన్న దగ్గరకే అన్ని రావాలనుకోవడం దొరల అహంకారాని నిదర్శనమన్నారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు.. అధికారం పోయినా అహంకారం ఇంకా పోలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలు శిక్షించడం ఖాయమని జోస్యం చెప్పారు.

# మేడ్చల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాస్వరం,మేడ్చల్

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుతరిగూడ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గండిమైసమ్మ నుంచి మేడ్చల్ చెక్‌పోస్ట్‌కు ఆటోలో వెనుక కూర్చొని ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడి పోయినట్లు తెలిపారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.మృతుడిని ఎవరైనా గుర్తుపడితే మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.





# గణేశ్ నవరాత్రుల సందర్భంగా శాంతి కమిటీ సమావేశం

తూప్రాన్ సెప్టెంబర్ 12 ప్రజా స్వరం ప్రతినిధి

తూప్రాన్పట్టణం లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ఈరోజు తూప్రాన్ పట్టణంలోపోలీస్ లు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ డీఎస్పీ శ్రీ నరేంద్ర గౌడ్ గారు హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్,బొంది రజని రవీందర్ గౌడ్ మున్సిపల్ కమిషనర్,రమేష్ ఎంఆర్ఓ, విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు, గణేశ్ మండపాల నిర్వాహకులు, తూప్రాన్ మండల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డీఎస్పీ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలనిఆయన సూచించారు. శాంతిభద్రతలు, మత సామరస్యం, ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు మరియు ఇతర శాఖల అధికారులకు సహకరించాలని కోరారు.


ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలనిడిఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు. డిజే లకు పర్మిషన్ లేదు ఎవరైనా డిజే పెట్టడానికి ప్రయత్నం చేస్తే సిజ్ చేసి బైండవర్ చేస్తాం అని హెచ్చరించారు ప్రజలు చూసి ఆనందించడానికి ప్రజలు భక్తులు మహిళా లు చూసేవిధంగా సమయం 4 గంటల నుండే ఊరేగింపు కు ఏర్పాట్లు చేసుకోవాలాని డిఎస్పీ సూచించారు



# తూప్రాన్ సూర్య మెడికల్ వద్ద ఉచితంగా మట్టి విగ్రహాలు పంపిణి...

- మట్టి వినాయకుడిని పూజిద్దాం
- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

తూప్రాన్ సెప్టెంబర్ 12
ప్రజా స్వరం ప్రతినిధి



తూప్రాన్ పట్టణలో ని సూర్య మెడికల్ యాజమాన్యం బొడ్డు రమ్య శ్రీహరి ఆధ్వర్యంలో గత 16 ఏళ్లుగా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణి చేస్తున్నారు వినాయక చవితి సోమవారం రోజు 11 వందల మట్టి విగ్రహాలు తయారుచేయించారు ఉదయం 8 గంటలకు పంపిణీ చేస్తారు ప్రజలందరికీ నా మనస్ఫూర్తిగా ఒక విజ్ఞప్తి. వినాయకుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం ఎంత ముఖ్యమో, మనం పూజించే విధానం ద్వారా ప్రకృతిని కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత.

ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా పెద్ద సంఖ్యలో విగ్రహాలను ప్రతిష్ఠించి, అనంతరం నిమజ్జనం చేస్తాం. అయితే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి పదార్థాలతో తయారైన విగ్రహాలు నీటిలో సులభంగా కరగకపోవడంతో చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరుల్లో కాలుష్యానికి కారణమవుతున్నాయి. విగ్రహాలకు ఉపయోగించే రంగుల్లో ఉండే కొన్ని రసాయనాలు నీటి జీవజాలానికి, పర్యావరణానికి హాని కలిగించే అవకాశం ఉంది.

అందుకే ఈ వినాయక చవితి నుంచి మనమంతా ఒక మంచి నిర్ణయం తీసుకుందాం.

**మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిద్దాం...**
**పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.**

భక్తిని చాటుదాం... బాధ్యతను కూడా చాటుదాం.అని బొడ్డు రమ్య శ్రీహరి అన్నారు

ఈ మంచి ఆలోచనను తూప్రాన్ పట్టణంలో గత 16 సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగిస్తున్న సూర్య మెడికల్ యాజమాన్యం, బొడ్డు రమ్య శ్రీహరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ప్రతి సంవత్సరం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పించడం నిజంగా అభినందనీయమైన సేవ.

ఇలాంటి కార్యక్రమాలు ఒక్కరోజుకే పరిమితం కాకుండా ప్రతి సంవత్సరం మరింత విస్తరించాలి. మన పిల్లలకు కూడా పర్యావరణ పరిరక్షణ విలువను నేర్పాలి. మనం తీసుకునే ఒక చిన్న నిర్ణయం భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేస్తుంది.

కాబట్టి తూప్రాన్ ప్రజలందరూ ఈసారి మట్టి వినాయక విగ్రహాలను పూజించి, పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను.

మట్టి వినాయకుడిని పూజిద్దాం —— మన చెరువులను కాపాడుదాం.ప్రకృతిని పరిరక్షిద్దాం








# ‘సేవా సంకల్ప అభియాన్’ వర్క్‌షాప్....

మెదక్ సెప్టెంబర్ 12 (ప్రజా స్వరం)

మెదక్ జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అధ్యక్షతన ‘సేవా సంకల్ప అభియాన్’ జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు అభియాన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. బూత్ స్థాయిలో రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, మొక్కలు నాటడం, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, వికసిత్ భారత్ లక్ష్య సాధన కు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, అభియాన్ కన్వీనర్ ఈర్ల రంజిత్ రెడ్డి, సంఘసాని సురేష్, శ్రీనివాస్, రమేష్ గౌడ్, రాగి రాములు, సుభాష్ గౌడ్, నల్లాల విజయ్, రాజేందర్, శంకర్ గౌడ్, కౌన్సిలర్లు రాజమణి, అఖిల భరత్ తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

- **మెదక్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం**

మెదక్, సెప్టెంబర్ 12 (ప్రజా స్వరం)

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని నేటి యువతరం అలవర్చుకోవాలని, ఆ పోరాట చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్ లో మెదక్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో “తెలంగాణ సాయుధ పోరాటం-హైదరాబాద్ రాజ్యంపై జరిగిన సైనిక చర్య” అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1946 నుంచి 1951 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కొనసాగిందన్నారు. ప్రధానంగా ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఈ పోరాటం తీవ్రంగా సాగిందని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ, దోపిడీ, అధిక వడ్డీకి వ్యతిరేకంగా రైతాంగం పోరాడిందన్నారు. “దున్నేవాడిదే భూమి” అనే నినాదంతో సాగిన పోరాటంలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారని గుర్తు చేశారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సుమారు 10 లక్షల ఎకరాల భూమిని 3 వేల గ్రామాల్లో పంచిన చరిత్ర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఉందని వక్తలు పేర్కొన్నారు. దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు, రజాకార్ల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాడారని తెలిపారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆధ్వర్యంలో సైనిక చర్య జరిగిందని, అనంతరం కూడా తెలంగాణలో సాయుధ పోరాటం కొనసాగిందని వక్తలు వివరించారు. ఈ పోరాటంలో అనేక మంది సామాన్య ప్రజలు, పోరాట నాయకులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రస్తుతం చరిత్రను వక్రీకరించే



ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాస్తవ చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మెదక్ సిటిజన్ ఫోరం నాయకులు కొండల్‌రెడ్డి, పి.డి. ఆనందం, బాగయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు బొందుగుల నాగరాజు, సీనియర్ జర్నలిస్టు చాగంటి హరినాథ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పవన్‌కుమార్, ఎం.డి. నజరుద్దీన్, సి.హెచ్. తిరుపతి, కె. పద్మారావు, గణేష్‌రెడ్డి, ఎం. గోపాల్, టి. సామెల్, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# గణపతి ఉత్సవాల నిర్వాహకులకు పోలీసుల సూచనలు

- **చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల గ్రామాల నిర్వాహకులకు భద్రతా సూచనలు**

చేర్యాల, ప్రజాస్వరం:

గణపతి ఉత్సవాల సందర్భంగా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో గణపతి విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు భద్రతా చర్యలు పాటించాలని చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్ సూచించారు. మూడు మండలాల పరిధిలోని గ్రామాల ఉత్సవ నిర్వాహకులకు గణపతి ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

భారీ విగ్రహాలను ఏర్పాటు కాకుండా , 6 నుంచి 7 అడుగుల ఎత్తులో విగ్రహాలను ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని తెలిపారు. మండపాలు, స్టేజీలను పటిష్టంగా నిర్మించుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఐ తెలిపారు. మండపాల నిర్మాణం, విద్యుత్ ఏర్పాట్లు, భక్తుల రాకపోకల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సీఐ బానోతు రమేష్‌నాయక్ కోరారు.




# మేడ్చల్ మండలంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు..

- **రాకేష్ కుమార్‌కు 'బెస్ట్ టీచర్' అవార్డు**

ప్రజాస్వరం,మేడ్చల్

మేడ్చల్ మండల్ ప్రైవేట్ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేడ్చల్‌లోని హైటెక్ వాల్యూ రెసిడెన్షియల్ హైస్కూల్‌లో ఈ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో శ్రీ వివేకానంద హైస్కూల్ ఉపాధ్యాయులు దుందిగళ్ళ రాకేష్ కుమార్ 'బెస్ట్ టీచర్' పురస్కారాన్ని అందుకున్నారు.

మేడ్చల్ మండల విద్యాశాఖాధికారి (MEO) వై. శంకరయ్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ బి. శ్రీధర్, ఎన్.ఎల్.కె. రామేశ్వర్ రెడ్డిలతో పాటు జి. హనుమంత్ రెడ్డి, పి. గిరిబాబు, జి.ఎల్.వి. నారాయణమూర్తి, రాధాకృష్ణ, ఎం. స్వామి దాస్, జోసెఫ్, సి. శ్రీనివాసులు రెడ్డి తదితర ప్రముఖులు అతిథులుగా పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి యొక్క గొప్పతనాన్ని, సమాజ నిర్మాణంలో మరియు విద్యారంగానికి ఉపాధ్యాయులు అందిస్తున్న అమూల్యమైన సేవలను కొనియాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించడంతో పాటు వారి సేవలను అభినందించారు.



## బుమ్రా వచ్చేశాడు.. సూర్యవంశీకి
# నెట్స్‌లో చుక్కలు!

- ప్రాక్టీస్‌లో అదరగొట్టిన స్టార్ పేసర్ బుమ్రా
- సూర్యవంశీకి వరుసగా యార్కర్లతో పరీక్ష
- ఓ బంతికి సూర్యవంశీ ఎడ్జ్ ఇచ్చిన వైనం
- సుమారు 45 నిమిషాలు పూర్తి తీవ్రతతో బౌలింగ్ చేసిన బుమ్రా
- గాయం తర్వాత ఫిట్‌గా కనిపించిన స్టార్ పేసర్

డీడీ9 వార్త :

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ అదిరిపోయింది. ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు ఢిల్లీలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో బుమ్రా అదరగొట్టాడు. నెట్స్‌లో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి తన బౌలింగ్‌తో గట్టి పరీక్ష పెట్టాడు.
బుమ్రా వేసిన తొలి బంతి యార్కర్. సూర్యవంశీకి కాస్త దూరంగా వెళ్లింది. రెండో బంతికి మంచి లెంగ్త్‌తో బంతిని బయటకు మళ్లించి అతడిని పూర్తిగా బీట్ చేశాడు. మూడో బంతి మరో యార్కర్. ఈసారి సూర్యవంశీ బ్యాట్ దించి బంతిని అడ్డుకున్నాడు. ఆ తర్వాత బుమ్రా వేసిన బంతికి సూర్యవంశీ ఎడ్జ్ ఇచ్చాడు. వికెట్ కీపర్‌కు సులభంగా క్యాచ్ వెళ్లే బంతి కావడంతో బుమ్రా వెంటనే సంబరాలు చేసుకున్నాడు. ఎట్టకేలకు సూర్యవంశీ ఓ ఓవర్‌పిచ్ బంతిని బౌండరీకి తరలించాడు. మొత్తంగా బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కొన్న సమయంలో యువ బ్యాటర్ పెద్దగా దూకుడుగా ఆడలేకపోయాడు.
బుమ్రా సుమారు 45 నిమిషాల పాటు పూర్తి తీవ్రతతో బౌలింగ్ చేశాడు. చాలా కాలం తర్వాత నెట్స్‌లోకి వచ్చినా ఫిట్‌నెస్‌పై ఎలాంటి సందేహాలు లేకుండా కనిపించాడు. గాయం నుంచి కోలుకుని జట్టులోకి తిరిగొచ్చిన బుమ్రాకు ఇది తొలి ప్రాక్టీస్ సెషన్.
ఐపీఎల్‌లో గతంలో బుమ్రా బౌలింగ్‌లోనే సూర్యవంశీ సిక్సర్ కొట్టాడు. ఈసారి మాత్రం నెట్స్‌లో బుమ్రా పైచేయి సాధించాడు. ఢిల్లీ సెషన్‌లో బుమ్రా తీవ్రత




## వైభవ్‌లాంటి ఒక్క బ్యాటర్‌నైనా తయారు చేశారా?.. పాకిస్థాన్‌కు వసీం అక్రమ్ చురకలు

- పీఎస్ఎల్‌పై వసీం అక్రమ్ తీవ్ర విమర్శలు
- పదేళ్లలో చెప్పుకోదగ్గ బ్యాటర్ వచ్చారా అని ప్రశ్న
- వైభవ్ సూర్యవంశీని పాకిస్థాన్‌కు ఉదాహరణగా చూపిన వైనం
- యువ బ్యాటర్లను తీర్చిదిద్దడంలో వ్యవస్థ విఫలమైందని వ్యాఖ్య
- క్లబ్ క్రికెట్‌ను పునరుద్ధరించాలని సూచన

డీడీ9 వార్త :

పాకిస్థాన్ క్రికెట్ ఎదుర్కొంటున్న సమస్య కేవలం ఓ టెస్టు సిరీస్‌లో ఓటమితో ముగిసేది కాదని మాజీ కెప్టెన్ వసీం అక్రమ్ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఫలితాలను మార్చగల బ్యాటింగ్ ప్రతిభను పాకిస్థాన్ వ్యవస్థ తయారు చేయలేకపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)పై ఆయన తీవ్ర ప్రశ్నలు సంధించారు.
పీఎస్ఎల్ ప్రారంభమై పదేళ్లు పూర్తయినా.. ఈ లీగ్ నుంచి అత్యుత్తమ బ్యాటింగ్ ప్రతిభ ఎందుకు బయటకు రాలేదని అక్రమ్ ప్రశ్నించారు. బౌలర్లను తయారు చేయడంలో లీగ్ కొంతమేర విజయవంతమైందని అంగీకరించిన ఆయన.. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న బ్యాటర్లను మాత్రం తయారు చేయలేకపోయిందన్నారు.
"పీఎస్ఎల్ ప్రారంభమై పదేళ్లు అవుతోంది. ఈ లీగ్ నుంచి ఒక్క బ్యాటర్‌నైనా తయారు చేశామా? కొంతమంది బౌలర్లు వచ్చారు. కానీ చెప్పండి.. చెప్పుకోదగ్గ బ్యాటింగ్ ప్రతిభను ఎవరినైనా తయారు చేశామా?" అని అక్రమ్ ప్రశ్నించారు.
ఈ సందర్భంగా భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు. చిన్న వయసులోనే సీనియర్ క్రికెట్‌లోకి దూసుకొచ్చిన సూర్యవంశీ తరహా బ్యాటింగ్ ప్రతిభ పాకిస్థాన్ నుంచి కూడా రావాల్సిన అవసరం ఉందన్నారు. "14 ఏళ్ల సూర్యవంశీ లాంటి బ్యాటింగ్ ప్రతిభ మనం తయారు చేసినప్పుడు పాకిస్థాన్ క్రికెట్‌లో మార్పు కనిపిస్తుంది" అని చెప్పారు.
అక్రమ్ విమర్శలు పీఎస్ఎల్‌కే పరిమితం కాలేదు. దేశవాళీ వ్యవస్థను బలోపేతం చేయాలని, క్లబ్ క్రికెట్‌ను తిరిగి పునరుద్ధరించాలని సూచించారు. కరాచీ, లాహోర్‌లో ప్రతిచోటా రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టాలని పీసీబీకి సూచించారు. ప్రతిభ గుర్తించేందుకు ఈ నగరాలే కీలకమని చెప్పారు. పునర్వ్యవస్థీకరించిన దేశవాళీ వ్యవస్థకు తరచూ మార్పులు చేయకుండా కనీసం మూడేళ్ల నుంచి నాలుగేళ్ల సమయం ఇవ్వాలని కోరారు.
ఇంగ్లాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో పాకిస్థాన్ బ్యాటింగ్ వైఫల్యాలపైనా అక్రమ్ స్పందించారు. రాబిన్సన్ వంటి బౌలర్లను ఎదుర్కొంటూ పాకిస్థాన్ బ్యాటర్లు క్రీజులో కదలకుండా నిలబడుతున్నారని, ఫ్రంట్ ఫుట్‌ను ముందుకు తీసుకెళ్లడం లేదని అన్నారు. ధైర్యంగా ఆడాలంటే ముందుగా అవసరమైన ప్రతిభ ఉండాలని పేర్కొన్నారు.



# కుల్దీప్ బాల్‌ను లైట్ తీసుకున్నాడు.. తర్వాత ఏం జరిగిందో చూసి బ్యాటర్ షాక్!

- కుల్దీప్ బౌలింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్
- బంతిని వదిలేసిన జమాన్ అక్తర్‌కు షాక్
- అనూహ్యంగా తిరిగి స్టంప్స్‌ను తాకిన బంతి
- ఎసెక్స్‌పై కుల్దీప్‌కు 10 వికెట్లు
- ఇంగ్లాండ్ వికెట్ల ప్రత్యేకత వివరించిన కుల్దీప్

డీడీ9 వార్త :




టీమిండియా స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఇంగ్లాండ్ కౌంటీ క్రికెట్‌లో తన స్పిన్ మాయాజాలాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ సీజన్‌లో యార్క్‌షైర్ తరఫున ఆడుతున్న కుల్దీప్ ఇటీవల ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి అదరగొట్టాడు. తాజాగా అతడు వేసిన ఓ బంతి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బ్యాటర్ బంతిని వదిలేయగా.. అది అనూహ్యంగా మలుపు తిరిగి స్టంప్స్‌ను గిరాటేసింది.
కౌంటీ ఛాంపియన్‌షిప్ డివిజన్ 1లో ఎసెక్స్‌తో ఈ నెల 10న ముగిసిన మ్యాచ్‌లో కుల్దీప్ తొలి ఇన్నింగ్స్‌లో 4/70, రెండో ఇన్నింగ్స్‌లో 6/50తో సత్తా చాటాడు. మొత్తంగా 10/120తో మ్యాచ్‌లో 10 వికెట్లు తీసుకున్నాడు. బ్యాటింగ్‌లోనూ 36 పరుగులు చేశాడు. కుల్దీప్ అద్భుత ప్రదర్శనతో యార్క్‌షైర్ ఇన్నింగ్స్ 106 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.
ఇక వైరల్ అవుతున్న వీడియోలో జమాన్ అక్తర్‌ను కుల్దీప్ బోల్తా కొట్టించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆఫ్‌స్టంప్‌కు చాలా దూరంగా కుల్దీప్ బంతిని పిచ్ చేశాడు. బంతి ఆఫ్ స్టంప్ బయటకు వెళ్తుందని భావించిన జమాన్ దాన్ని ఆడకుండా బ్యాట్ ఎత్తేశాడు. కానీ బ్యాటర్ ఊహకు అందని విధంగా బంతి పిచ్ అయిన తర్వాత లోపలికి భారీగా తిరిగింది. నేరుగా స్టంప్స్‌ను తాకడంతో జమాన్ షాక్‌కు గురయ్యాడు. చేసేదేమీ లేక పెవిలియన్‌కు చేరాడు.
మ్యాచ్ తర్వాత కుల్దీప్ మాట్లాడుతూ.. బౌలింగ్‌కు వికెట్ చాలా అనుకూలంగా ఉందని చెప్పాడు. బంతిని వేగంగా వేయాల్సిన అవసరం లేదని, వికెట్‌లోనే మంచి పేస్ ఉందని వివరించాడు. బంతిని పిచ్ చేసిన తర్వాత అందులో వేగం కనిపించిందని, ఎక్కువ రివల్యూషన్స్‌తో స్పిన్ చేయడమే కీలకమని తెలిపాడు.
భారత్‌లో పరిస్థితులతో పోలిస్తే ఇంగ్లాండ్ వికెట్లు పూర్తిగా భిన్నంగా ఉంటాయని కుల్దీప్ చెప్పాడు. స్వదేశంలో ఎక్కువగా స్పిన్ లభించినా పిచ్‌లు నెమ్మదిగా ఉంటాయని, బ్యాటర్లు అందుకు తగ్గట్టుగా సర్దుకునే అవకాశం ఉంటుందని వివరించాడు. ఇంగ్లాండ్‌లో వికెట్లలో వేగం ఉండటంతో బ్యాటర్ బ్యాక్‌ఫుట్‌కు వెళ్తే ఇబ్బందుల్లో పడతాడని చెప్పాడు. అందుకే ఫ్రంట్‌ఫుట్‌పై ఆడాల్సి ఉంటుందని, అప్పుడు క్యాచ్ ఔట్, స్లిప్, షార్ట్ లెగ్‌లో క్యాచ్ కొట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించాడు.
కుల్దీప్ భారత్ తరఫున ఇప్పటివరకు 19 టెస్టులు ఆడి 80 వికెట్లు తీశాడు. ఈ ఫార్మాట్‌లో ఐదు సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించాడు. అయితే ఇటీవలి కాలంలో జాతీయ జట్టులో తుది జట్టులో చోటు దక్కించుకోవడంలో అతడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు.

# అరంగేట్రంలోనే రికార్డు మోత.. పాక్ ఆటగాడు రజావుల్లాకు ఇంగ్లీష్ ప్రేక్షకులు స్టాండింగ్ ఓవేషన్..

- ఇంగ్లండ్‌తో టెస్టులో పాక్ అరంగేట్ర బౌలర్ రజావుల్లా విధ్వంసం
- కేవలం 63 బంతుల్లో 9 సిక్సర్లతో 81 పరుగులు
- టెస్టు అరంగేట్రంలోనే పాక్ తరఫున ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డు
- ఇన్నింగ్స్ ఓటమి నుంచి పాక్‌ను గట్టెక్కించిన అతని కీలక ఇన్నింగ్స్
- షార్ట్ బాల్ అంటేనే నాకిష్టం అని వ్యాఖ్యానించిన యువ పేసర్

డీడీ9 వార్త :




క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మ్యాచ్ ప్రతి ఆటగాడికి చిరస్మరణీయం. కానీ, పాకిస్థాన్‌కు చెందిన 21 ఏళ్ల యువ పేసర్ రజావుల్లా తన తొలి టెస్టును ఎప్పటికీ మరిచిపోలేని విధంగా మలుచుకున్నాడు. బౌలర్‌గా జట్టులోకి వచ్చి, బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఆఖరి టెస్టులో ఓటమి అంచున నిలిచిన పాకిస్థాన్‌ను తన అద్భుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. కేవలం 63 బంతుల్లో 9 సిక్సర్లు, 81 పరుగులతో ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ ప్రదర్శనకు ఎడ్జ్‌బాస్టన్ స్టేడియం మొత్తం నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) అభినందించింది.
మూడో రోజు ఆటలో పాకిస్థాన్ ఇన్నింగ్స్ ఓటమి దిశగా సాగుతున్నప్పుడు రజావుల్లా 9వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్ వంటి ఇంగ్లండ్ మేటి పేస్ బౌలర్లను ఏమాత్రం భయపడకుండా ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా పాక్ టాప్ ఆర్డర్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన షార్ట్ బంతులనే లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లు ఆడాడు. ఈ క్రమంలో కేవలం 43 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టెస్టు అరంగేట్రంలో పాకిస్థాన్ తరఫున అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ ఇదే కావడం విశేషం.
ఈ మ్యాచ్‌లో మహమ్మద్ అబ్బాస్ (42)తో కలిసి రజావుల్లా 121 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ ఇద్దరి పోరాటంతో పాకిస్థాన్ 449 పరుగుల స్కోరు చేసింది. తన అద్భుతమైన ఇన్నింగ్స్ పై రజావుల్లా మాట్లాడుతూ.. "ప్రేక్షకులు నిలబడి చప్పట్లు కొడుతుంటే చాలా ఆనందంగా అనిపించింది. నేను జీవితాన్ని ఆస్వాదించాలనుకుంటాను. నాకు షార్ట్ బాల్ అంటే చాలా ఇష్టం. దేశం కోసం ఆడుతున్నప్పుడు భయపడాల్సిన అవసరం లేదు. నాపై నాకు నమ్మకం ఉంది. అందుకే సానుకూల ఫలితం వచ్చింది" అని తెలిపాడు. అరంగేట్రంలోనే అద్భుత శతకం చేసేలా కనిపించినా, రజావుల్లా ఆ మార్కుకు 19 పరుగుల దూరంలో ఔటయ్యాడు. అయినప్పటికీ, అతని పోరాట పటిమ క్రీడా ప్రపంచాన్ని ఆకట్టుకుంది.

# సిరాజ్ చేతికి హైదరాబాద్ పగ్గాలు.. రంజీలో అసలు పరీక్ష!

- హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా సిరాజ్ ఎంపిక
- చామా మిలింద్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు
- అక్టోబర్ 11న త్రిపురతో హైదరాబాద్ తొలి మ్యాచ్
- ఎలైట్ గ్రూప్-బిలో హైదరాబాద్
- కెప్టెన్‌గా రంజీలో సిరాజ్‌కు కొత్త సవాలు

డీడీ9 వార్త :

రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌కు హైదరాబాద్ జట్టు కొత్త ఉత్సాహంతో సిద్ధమవుతోంది. భారత స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు జట్టు పగ్గాలు అప్పగించింది హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ). 202627 సీజన్‌లో హైదరాబాద్‌కు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. చామా మిలింద్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు.
అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో త్రిపురతో హైదరాబాద్ తలపడనుంది. హైదరాబాద్ ఎలైట్ గ్రూప్ బిలో ఉంది. సౌరాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అస్సోం, త్రిపుర ఈ గ్రూపులో ఉన్నాయి.
ఇటీవల శ్రీలంక పర్యటనలో సిరాజ్ ఆశించిన స్థాయిలో వేగం చూపలేకపోయాడు. సాధారణంగా గంటకు 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేసే అతడు.. అక్కడ 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడు. రెండు మ్యాచ్‌ల్లో 44 ఓవర్లు వేసి నాలుగు వికెట్లు తీసుకున్నాడు.
రెండు నెలల విరామం తర్వాత నేరుగా మ్యాచ్ ఆడటంతో తన బౌలింగ్ లయ దెబ్బతిన్నట్లు సిరాజ్ తెలిపాడు. రన్‌అప్‌లో అడుగులు సరిగ్గా పడకపోవడంతో వేగం తగ్గిందని చెప్పాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో మాత్రం సిరాజ్ తిరిగి లయ అందుకున్నాడు. శ్రీలంక నుంచి వచ్చిన కొన్నిరోజులకే చెన్నై మ్యాచ్ ఆడినా.. దేశం తరఫున ఆడేటప్పుడు సాకులు చెప్పకూడదని స్పష్టం చేశాడు. జట్టు కోసం పూర్తి స్థాయిలో కష్టపడటమే తనకు ముఖ్యమని చెప్పాడు. ఇప్పుడు హైదరాబాద్ కెప్టెన్‌గా సిరాజ్ ముందు మరో సవాలు ఉంది. నాయకత్వంతో పాటు బంతితోనూ సత్తా చాటేందుకు అతడికి రంజీ సీజన్ మంచి అవకాశం కానుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999